

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చన పట్నాయక్ బాధ్యతల స్వీకారం

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన ఎన్నికల ప్రధానాధికారిగా అర్చనా పట్నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతేగాక రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా ఎన్నికల ప్రధానాధికారిగా రికార్డులకెక్కారు. ఇప్పటి వరకూ ఎన్నికల ప్రధాన అధికారిగా వ్యవహరించిన సత్యప్రద సాహూ ప్రభుత్వ విధులకు బదిలీ అయిన విషయం తెలిసిందే.



'కంగువా' స్పెషల్ షోకు సర్కారు అనుమతి

7లో

హోటల్ వ్యాపార రంగంలో సినీ తారలు



నటి కస్తూరి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు



6లో

ముంచెత్తిన వర్షం



పూందమల్లి రహదారిలో నిలిచిన వాహనాలు



పెరియమేట్ బస్టాపు వద్ద గొడుగులు పట్టుకుని నిలిచిన ప్రయాణికులు

చెన్నై లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లో సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. చెన్నై సెంట్రల్, గిండి, మాంబళం, మందవెల్లి, కోడంబాక్కం, అడయారు, బీసెంట్‌నగర్, తిరువాన్మియూరు, చేపాక్, వడపళని, కోయంబేడు, మధురవాయల్, రాయపేట, మైలాపూరు తదితర ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. ఈ వర్షానికి సైదాపేట, ఆదంబాక్కం, ఆలందూరు, వేళచ్చేరి తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. నందనంలో 4.5 సెం.మీ., అన్నా వర్సిటీ ప్రాంతంలో 4.4 సెం.మీ, మీనంబాక్కంలో 3.9 సెం.మీ, పళ్ళిక్కరణై ప్రాంతంలో 3. సెం.మీ వర్షం కురిసినట్టు వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షం కారణంగా నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట, రామనాథపురం జిల్లాల్లో కూడా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.



నేడు, రేపు కుండపోత

రాజధాని నగరం చెన్నైలో బుధ,గురువారాల్లో పలుచోట్ల కుండపోతగా వర్షం కురిసే అవకాశముందని బాలచంద్రన్ తెలిపారు. బంగాళాఖాతంలోని అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్నారు.

12 జిల్లాలకు వర్షసూచన..

బుధవారం చెన్నై సహా 12 జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని దక్షిణ మండల వాతావరణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బాలచంద్రన్ ప్రకటించారు. మంగళవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం తుపానుగా మారే అవకాశం లేదని, ప్రస్తుతం రుతుపవనాల ప్రభావం కారణంగానే రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తున్నాయన్నారు. బుధవారం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, మదురై, విరుదునగర్, రామనాథపురం, తెన్‌కాశి, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఆయన వివరించారు.



మైలాపూరులో వాననీటి కాల్వ కోసం తవ్విన గోతిలో చేరిన వర్షపునీరు

జాలర్లకు హెచ్చరిక..

బంగాళాఖాతంలోని మన్నార్ జలసంధి, కన్నియాకుమారి తీరం సహా సముద్రతీర ప్రాంతాల్లో గంటలకు 40 నుంచి 45 కి.మీ.ల వేగంతో పెను గాలులు వీచే అవకాశం ఉందని, అలల ఉధృతి కూడా అధికంగా ఉంటుందని, జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని స్థానిక వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.

విమాన సేవలకు అంతరాయం..

మంగళవారం ఉదయం కురిసిన వర్షం కారణంగా విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెన్నై నుంచి ఢిల్లీ, ముంబాయి నగరాలకు వెళ్లే ఎయిర్ ఇండియా విమానాలు ముప్పావు గంట ఆలస్యంగా బయలుదేరాయి. అదేవిధంగా హైదరాబాద్ వెళ్లే విమానాలు అరగంట ఆలస్యంగా బయలుదేరాయి.





కార్యక్రమంలో ప్రముఖులు

సామాజిక అభివృద్ధిలో విద్య పాత్ర కీలకం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక అభివృద్ధిలో విద్య పాత్ర కీలకమని, ఈ నేపథ్యంలో విద్యా ద్వారా యువతకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు వారిలో మానవీయ విలువలను నాటాల్సిన అవసరముందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మంగళవారం వేలూరులోని వీఐటీలో 4 దశాబ్దాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య.. ఆర్‌జీ టవర్, సరోజినీ నాయుడు బ్లాక్‌లను ప్రారంభించడంతో పాటు పలువురు విద్యార్థులకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ జి.విశ్వనాథన్ దూరదృష్టి కలిగిన వ్యక్తి మాత్రమే గాక, గొప్ప కార్యదీక్షాపరుడని ప్రశంసించారు. నాలుగు దశాబ్దాలపాటు ఓ సంస్థను ముందుకు తీసుకువెళ్లడం దీక్షా నిబద్ధతలతో కూడుకున్న అంశమని, విద్యారంగాన్ని సేవా రంగంగా, సమాజానికి మేలు చేయగల మార్గంగా భావించిన వారి స్ఫూర్తి ఆదర్శనీయమైనదని కొనియాడారు. ఈ సంస్థ అభివృద్ధిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అవసరానికి మించిన సాంకేతికత వినియోగం శారీరక, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఏ భాషలో చదివినా, ఎన్ని భాషలు నేర్చుకున్నా యువత మాతృభాష మీద ప్రేమ పెంచుకోవాలని సూచించారు. భాషను బలవంతంగా రుద్దటం కానీ, వ్యతిరేకించడం గానీ చేయకూడదని, మాతృభాషను ప్రేమించుకోవడంతో పాటు ఇతర భాషలను గౌరవించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని వెంకయ్య యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌తో పాటు తమిళనాడు జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, ఈడీ డాక్టర్ సంధ్య, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధి మల్లిక్, ఎంపీ కదిరవన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ యూనియన్లకు నూతన భవనాలు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో రూ.64.53 కోట్లతో నిర్మించిన 17 పంచాయతీ యూనియన్ భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. కోవై సహా 12 జిల్లాల్లో నిర్మించిన ఆ భవనాలను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇ.పెరియసామి, కె.పొన్ముడి, సీవీ గణేషన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పంచాయతీయూనియన్లు, పంచాయతీ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌సింగ్ బేదీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీల శాఖ సంచాలకులు పి. పొన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి తిరువళ్లువర్ విగ్రహ ప్రతిష్ఠ రజతోత్సవాలు:

ప్రపంచపర్యాటక ప్రాంతమైన కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహ ప్రతిష్ఠాపన రజోత్సవాలు డిసెంబర్ 1 నుంచి జనవరి 1 వరకు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. జనవరి 1, 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి 133 అడుగుల తిరువళ్లువర్ విగ్రహాన్ని ఆవిష్కరించారని ఆయన గుర్తు చేశారు. అంత ఎత్తయిన విగ్రహాన్ని నిర్మిస్తుంటే అలల తాకిడికి, పెనుగాలులకు ఆ విగ్రహం కొట్టుకుపోతుందని పలువురు యెద్దేవా చేశారని, విమర్శలను తట్టుకుని 25 యేళ్లుగా ఆ విగ్రహం చెక్కుచెదరకుండా పటిష్టంగా ఉందన్నారు. సునామీలో కూడా ఆ విగ్రహానికి ఎలాంటి ముప్పువాటిల్లలేదన్నారు. ఇంతటి కీర్తిని సంతరించుకున్న ఆ విగ్రహం రజతోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే ఘనంగా నిర్వహించనున్నట్టట తెలిపారు. ఆ మేరకు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కళాశాల విద్యార్థులకు సోషల్ మీడియలో షార్ట్స్ రిలీజ్, ఏఐ, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తిరుక్కురళ్ ప్రతిష్ఠను చాటేలా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31 నుంచి రెండు రోజుల పాటు తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతంలో లేజర్‌షో ఉంటుందని, విదేశాల్లో తమిళ అంతర్జాల సంస్థలు, తమిళ సంఘాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న తమిళ సంఘాలు, ఢిల్లీలోని తమిళనాడు హౌస్ వద్ద ఆ షో ప్రసారం చేస్తామన్నారు. అన్ని జిల్లాల్లోని గ్రంథాలయాల్లో తిరుక్కురళ్‌పై వివిధ రకాల పోటీలు నిర్వహించేలా ఆదేశాలిచ్చామన్నారు. డిసెంబర్ 25 నుంచి 30 వరకు జిల్లా స్థాయిలో తిర్కుక్కురళ్‌కు సంబంధించి సదస్సులు, చర్చలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని సీఎం ప్రకటించారు.

విద్యా సేవలో 120 ఏళ్లు

-7లో

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- ఉపముఖ్యమంత్రి ఉదయనిధి
- ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలపై సమీక్ష



కంట్రోల్‌రూమ్ పనితీరు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మేయర్ ప్రియ

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పటిష్ఠమైన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి విపత్తులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కంట్రోల్ రూమ్ పనితీరును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసిందని, ఆ మేరకు ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను సమీక్షించినట్టు తెలిపారు. చెన్నైలో సగటున 3.60 సెం.మీ. వర్షపాతం, అదే విధంగా పెరుంగుడిలో 7.35 సెం.మీ, చెంగల్పట్టు 1.06 సెం.మీ., తిరువళ్లూరులో 0.6 సెం.మీ వర్షపాతం నమోదైందన్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు నగరంలో వర్షం కురిసినా రహదారుల్లో నీరు నిలవలేదని, విద్యుత్ మోటార్లతో వాననీటిని కార్పొరేషన్ కార్మికులు ఎప్పటికప్పుడు తోడేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 329 సహాయక శిబిరాలు, వర్షబాధితుల కోసం 120 వంటశాలలు, రోడ్లపై వాననీటిని తొలగించేందుకు 1194 మోటారు పంపుసెట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నగరంలోని 22 సబ్‌వేలలో ఒకటి మినహా మిగిలిన అన్నిచోట్లా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని చెప్పారు. నగరంలో వర్ష, వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించడానికి చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 22 వేల మంది సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి: ఎస్డీఆర్ఎఫ్

ఆరు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సూచించింది. ఆ మేరకు రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లకు అత్యవసర లేఖ పంపింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పవాయుపీడనం కేంద్రీ కృతం కావటంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, వర్ష బాధితులకు సహాయక చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచించింది.



చెన్నై టి.నగర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలకు 'సాహిత్య సేతు సమ్మాన్' పురస్కారాలను అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి. చిత్రంలో మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఆర్‌కే సిన్హా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సింగ్ తదితరులు

సమాచార దర్శిని

చెన్నై సహా మూడు ప్రాంతాల్లో 'బెలూన్ ఫెస్టివల్'

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10 నుంచి 19వ తేది వరకు చెన్నై, కోవై, పొల్లాచ్చి తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. గతంలో పొల్లాచ్చిలో ఈ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించేవారు. ఈ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో, దీనిని మరి కొన్ని ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం సంక్రాంతి పండుగ సందర్భంగా చెన్నై, కోవై, పొల్లాచ్చి ప్రాంతాల్లో జనవరి 10 నుంచి 19 వరకు ఈ ప్రదర్శన ఏర్పాటుచేయనున్నారు. చెన్నైలో ప్రదర్శన జరిగే ప్రాంతాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

తూత్తుకుడి-నాగై మధ్య రూ.12వేల కోట్లతో రహదారి

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) తూత్తుకుడి-నాగపట్టణం హార్బర్లను అనుసంధానిస్తూ రూ.12,005 కోట్లతో కొత్తగా నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుచేయాలని జాతీయ రహదారుల శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా తూత్తుకుడి హార్బర్ నుంచి రామనాథపురం మధ్య 134 కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు రూ.4,915 కోట్లు, రామనాథపురం నుంచి నాగపట్టణం వరకు 174 కి.మీ రహదారికి రూ.7,090 కోట్లు మొత్తం ప్రాజెక్టుకు రూ.12,005 కోట్లు కేటాయించి, త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కొడైకెనాల్‌లో భారీ వాహనాల నిషేధం

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ కొండ మార్గంలో పొడవైన భారీ వాహనాలకు నిషేధం విధిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, 12 మీటర్ల కంటే ఎక్కువ పొడవైన చట్రం ఉన్న ప్యాసింజర్, కార్గో వాహనాలను నిషేధించారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు కలెక్టరేట్ తెలియజేసింది.

కోవలంలో హెరిటేజ్ పార్క్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవలం సమీపంలో 223 ఎకరాల్లో రూ.100 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నందనవనం పేరుతో హెరిటేజ్ పార్క్ ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ తెలిపింది. ఈ నందనవనంలో 4,000 వాహనాలకు పార్కింగ్ సదుపాయంతో పాటు, రెండు స్టార్ హోటళ్లు నిర్మించనున్నారు. అలాగే, ఎడారి అడవి, విహారం, మైదానం అనే మూడు విభాగాలుగా ఈ పార్క్ ఏర్పాటుకానుంది. రాష్ట్ర సంప్రదాయ, చరిత్ర సూచించే అంశాలు, దేవాలయాలు, శిల్పాలు, గ్రామీణ దేవతల విగ్రహాలు, మ్యూజిక్ ఫౌంటైన్ తదితరాలు ఎడారి అడవి, విహారం విభాగాల్లో ఉండగా, మైదానం మాత్రం పూర్తిగా పిల్లల ఆటల ప్రదేశంగా ఏర్పాటుకానుంది. సాంస్కృతిక కార్యక్రమాల కోసం 13 ఎకరాల విస్తీర్ణంలో 25,000 మంది కూర్చునే వేదిక నిర్మించనున్నారు. ప్లానిటోరియం, ఏటీవీ, గో-కార్ట్ జోన్ సహా పలు ప్రత్యేక అంశాలతో ఈసీఆర్ ప్రాంతంలో మరో పర్యాటక కేంద్రం ఏర్పాటుకానుందని అధికారులు తెలిపారు.

14, 15 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముహూర్తపు రోజులైన ఈ నెల 14,15 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందజేయనున్నారు. ఆ ప్రకారం, గురు, శుక్రవారాల్లో ఒక రిజిస్ట్రార్ ఉండే కార్యాలయాల్లో 150 టోకెన్లు, ఇద్దరు రిజిస్ట్రార్లుండే కార్యాలయాల్లో 300 టోకెన్లు అందించనున్నారు. అలాగే, రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగే వంద కార్యాలయాల్లో 150 టోకెన్లు, తత్కాల్ విధానంలో అందజేసే 12 ముందస్తు టోకెన్లతో పాటు అదనంగా మరో నాలుగు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలియజేసింది.

రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.11,733 కోట్లు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖకు అక్టోబరు నెల వరకు రూ.11,733 కోట్లు ఆదాయం సమకూరింది. ఆ ప్రకారం గత ఏడాది ఇదే కాలంలో రూ.1,0511 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ శాఖకు రూ.1,222 కోట్లు అదనపు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

పెరిగిన వాణిజ్య పన్ను శాఖ ఆదాయం

వాణిజ్య పన్ను శాఖ ఆదాయం గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.70,543 కోట్లు వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.79,772 కోట్లు లభించింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.9,229 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. జాతీయ స్థాయిలో జీఎస్టీ వృద్ధి 11.59 శాతం ఉండగా, రాష్ట్రంలో 19.39 శాతంగా ఉంది.

రూ.1,000 పొదుపు చేస్తున్న మహిళలు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రోత్సాహక నిధి కింద మహిళలకు నెలకు రూ.1,000 అందించే పథకాన్ని 2023 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంలో 1.15 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.1,000 అందజేస్తున్నారు. ఆ ప్రకారం సహకార బ్యాంకుల్లో ఖాతా కలిగిన 9 లక్షల మంది ఈ పథకంలో లబ్ధిపొందుతుండగా, వారిలో సుమారు 50వేల మంది ఈ నగదు డ్రా చేయకుండా పొదుపు చేస్తున్నారు. అలాగే, ఇతర బ్యాంకుల్లో ఖాతా కలిగిన లబ్దిదారులు వృధాగా ఖర్చుచేయకుండా నెలవారీ పొదుపు పథకంలో డిపాజిట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

11 మంది జాలర్లకు రెండేళ్ల జైలుశిక్ష

- శ్రీలంక కోర్టు తీర్పు
- రెండు రోజుల్లో మరో 35 మంది జాలర్ల అరెస్టు
- అట్టుడికిన తీరప్రాంతాలు ● పలు చోట్ల ధర్నాలు



పాంబన్ వద్ద ధర్నా చేస్తున్న జాలర్లు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు హద్దుమీరుతున్న శ్రీలంక నావికాదళం ఆగడాలను నిరశిస్తూ, తమ వారిని కాపాడాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జాలర్లు ఆందోళనలు చేపట్టారు. దీంతో మంగళవారం సముద్రతీరాల్లో ఉద్రిక్తత నెలకొంది. ఈ నెల 10వ తేదీ శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన 23 మంది జాలర్లలో 11 మందికి శ్రీలంక కోర్టు మంగళవారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మరో నలుగురు జాలర్లను విడుదల చేసింది. మరో పది మంది జాలర్లకు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా గత రెండు రోజుల్లో ఏకంగా 35 మంది తమిళ జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. ఈ నెల 10వ తేదీ 23 మంది, మంగళవారం వేకువజామున 12 మంది జాలర్లు అరెస్టయ్యారు. ఈ వరుస అరెస్టులతో ఆగ్రహించిన రాష్ట్ర జాలర్లు నాగపట్టణం, రామేశ్వరం, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. రామేశ్వరం ప్రాంతానికి చెందిన వందలాదిమంది జాలర్లు తమ కుటుంబ సభ్యులతో వచ్చి పాంబన్ బ్రిడ్జిపై రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా వారు లంక పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి, ధర్నా విరమింపజేశారు. మరోవైపు నాగపట్టణంలోని పలు ప్రాంతాల్లో కూడా జాలర్లు ఆందోళనలు చేశారు.

కూటమి నిర్ణయం పార్టీ అధిష్ఠానానిదే

బీజేపీ నేత హెచ్.రాజా

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి గురించి నిర్ణయం తీసుకొనే అధికారం పార్టీ అధిష్ఠానానికే ఉందని, తాను ఈ విషయంలో జోక్యం కలుగజేసుకోబోనని బీజేపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే హెచ్. రాజా పేర్కొన్నారు. తిరువళ్లూర్ జిల్లా లోని తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారిని మంగళవారం దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2001వ సంవత్సరం అప్పటి అసెంబ్లీలో రాష్ట్రంలో క్రీడలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని బీజేపీ ఎమ్మెల్యేగా కోరానని, అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత వెంటనే అమలుపరిచేలా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టారని గుర్తుచేసుకున్నారు. బీజేపీలో తాను 35 ఏళ్లుగా పలు పదవుల్లో రాణించానని, అయితే ఎన్నడూ కూటమి గురించి ప్రస్తావించలేదని తెలిపారు.

ఎన్నికలకు ఇంకా సమయం ఉంది - తమిళిసై

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉందని, అప్పుడే కూటమి గురించి నిర్ణయం తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. ఆమె మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిలను పొగిడేందుకే మంత్రులు సమయం కేటాయిస్తున్నారని, ప్రజల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ జాతీయ నాయకులు కూటమి గురించి నిర్ణయం తీసుకుంటారని ఆమె తెలిపారు.

డీజిల్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం

కొరుక్కుపేట వద్ద ఆగిపోయిన రైలు ● ఇతర రైళ్ళ రాకపోకలకు అంతరాయం

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి ఎక్స్‌ప్రెస్‌ను యార్డుకు తరలిస్తున్న డీజిల్ ఇంజిన్‌లో సాంకేతికలోపం ఏర్పడడంతో కొరుక్కుపేట వద్ద నిలిచిపోయింది. ఈ కారణంగా ఆ మార్గంలో చెన్నై సెంట్రల్‌కు రావాల్సిన ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సబర్బన్ రైళ్ళ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మేట్టుపాళెయం నుంచి చెన్నై సెంట్రల్‌కు నీలగిరి ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం వచ్చింది. ప్రయాణికులంతా దిగిన తర్వాత ఆ రైలును ఎన్నూరు యార్డుకు డీజిల్ ఇంజిన్ తగిలించి తరలిస్తుండగా, కొరుక్కుపేట రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఇంజిన్‌లో సాంకేతికలోపం తలెత్తింది. దీంతో ఆ రైలు మార్గమధ్యంలో ఆగిపోయింది. ఈ కారణంగా ఈ మార్గంలో రైళ్ళ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెన్నై సెంట్రల్ నుంచి గుమ్మిడిపూండి వైపు వెళ్ళాల్సిన రైళ్ళను కొద్దిసేపు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు, ఇంజనీర్లు అక్కడకు చేరుకుని రైలింజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిచేశారు. ఆ తర్వాత ఆ రైలును ఎన్నూరు యార్డుకు తరలించారు.

రుణాలిచ్చిన బ్యాంకర్లకు అభినందన


బ్యాంక్ అధికారులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాలకు అధికంగా రుణాలు అందజేసిన బ్యాంక్ అధికారులను కలెక్టర్ అభినందించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అధిక రుణాలు ఇచ్చిన బ్యాంకర్లను కలెక్టర్ సుబ్బులక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమరన్, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, పంచాయతీల డైరెక్టర్ ఉమ, వేలూరు తహసీల్దార్ బాలసుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్న సంఘ నాయకులు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమ కోర్కెలతో కూడిన వినతిపత్రాన్ని సంఘ నాయకులు మంగళవారం కో-ఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సెక్రటరీ ధర్మలింగం మాట్లాడుతూ... 2021 రుణ మాఫీకి సంబంధించి ప్రభుత్వం సంఘాలకు ఎలాంటి నిధులు అందజేయకపోవడంతో, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. తాజాగా అమ్మ మెడికల్ షాపుల పేరు మార్చి ముఖ్యమంత్రి మెడికల్ షాపులుగా మార్చనున్నట్లు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లబ్ధిదారులకు రూ.9.16 లక్షల సహాయాల పంపిణీ


లబ్ధిదారులకు సహాయాలు అందిస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు నియోజకవర్గంలో 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా పలు శాఖల ఆధ్వర్యంలో 445 మంది లబ్ధిదారులకు రూ.9.16 లక్షల విలువైన సంక్షేమ సహాయాలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల అధ్యక్షుడు బాబు, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, ఆనైకట్టు యూనియన్ సెక్రటరీ పాండ్యన్, ఆనైకట్టు కేంద్ర యూనియన్ సెక్రటరీ వెంకటేశన్, జిల్లా కౌన్సిలర్ కృష్ణమేనన్, తహసీల్దార్ వేండా, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జువ్వాది కొండల్లో శిలాఫలకాలు లభ్యం


లభ్యమైన శిలా ఫలకాలు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ సమీపంలో రెండు శిలాఫలకాలు బయల్పడ్డాయి. తిరుపత్తూర్ తూయనెంజై కళాశాల తమిళ శాఖ లెక్చరర్ మోహన్ గాంధీ అధ్యక్షతన పరిశోధకులు హరీష్, మునుస్వామితో కూడిన బృందం జువ్వాది కొండల దిగువ ప్రాంతాల్లో పరిశోధన చేపట్టింది. రోడ్డు పక్కన భూమిలో పూడుకుపోయిన రెండు శిలాఫలకాలను ఈ బృందం గుర్తించింది. ఒక రాతి శిల్పం రెండడుగుల ఎత్తుతో చేతిలో కత్తితో గుర్రంపై వీరుడు కూర్చున్నట్లు చెక్కబడి ఉంది. రెండవ శిలాఫలకం 2.5 అడుగుల ఎత్తుతో ఒక మహిళ సజీవదహనం చేసుకుంటున్నట్లు ఉంది. ఈ శిలాఫలకాలను బట్టి, ఆ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో వీరుడు మరణించి ఉండొచ్చని, అందుకు గుర్తుగా ఈ శిలాఫలాకం చెక్కి ఉంటారని, ఇది 16వ శతాబ్దానికి చెందిన నాయక రాజుల కాలం నాటిదని పరిశోధకులు తెలిపారు.

బీడీ ఆకుల బండిళ్లు స్వాధీనం

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూత్తుక్కుడి జిల్లా కులశేఖరపట్టణం నుంచి అక్రమంగా శ్రీలంకకు తరలిస్తున్న 630 కేజీల బీడీ ఆకుల బండిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కులశేఖరపట్టణం నుంచి సముద్రమార్గం గుండా బీడీ ఆకులను తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని క్యూ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి క్యూ బ్రాంచ్ పోలీసులు సముద్రతీరంలో నిఘా వేశారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో మూడు ద్విచక్రవాహనాల్లో బీడీ ఆకుల బండిళ్లతో తీరంలో ఉన్న ఆరుగురు వ్యక్తులను గుర్తించారు. వారిని క్యూబ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిదగ్గరున్న 630 కేజీల బీడీ ఆకుల బండిళ్ళు, ద్విచక్రవాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పాఠశాలలో 'వేట్టయన్', 'గోట్' చిత్రాల ప్రదర్శన

● విద్యాశాఖ విచారణ

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా వీకే పురం ప్రాంతంలోని ఓ ఎయిడెడ్ పాఠశాలలో గత శనివారం రజనీకాంత్ నటించిన 'వేట్టయన్', విజయ్ నటించిన 'గోట్' చిత్రాలు ప్రదర్శించారు. పాఠశాలలో సినిమాల ప్రదర్శనను వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత ప్రజలు జిల్లా ప్రధాన విద్యాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు మంగళవారం ఉదయం విచారణ చేపట్టారు. ఇందుకోసం విద్యార్థుల నుంచి తలా రూ.25 వసూలుచేసారని, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'వేట్టయన్', 6 నుంచి ప్లస్ టూ విద్యార్థులకు 'గోట్' చిత్రాలు ప్రదర్శించినట్లు విచారణలో తెలిసింది. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు మాత్రమే ఈ చిత్రాలు ప్రదర్శించినట్లు పాఠశాల యజమాన్యం అధికారులకు తెలిపింది. విద్యార్థుల నుంచి తీసుకున్న నగదు తిరిగివ్వాలని ఆదేశించిన అధికారులు, ఈ వ్యవహారంపై విచారిస్తున్నారు.

తిరువేర్కాడులో ప్రభుత్వ స్థలం స్వాధీనం

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడిలోని అయపాక్కం-తిరువేర్కాడు ప్రధాన రోడ్డు సమీపం కోలడి జలాశయం స్థలాన్ని ఆక్రమించి 119 దుకాణాలు నిర్మించారు. ఈ విషయంపై పలువురు జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన అధికారులు రెండు నెలల క్రితం తొలివిడతగా 10 దుకాణాలు తొలగించాలని నోటీసులిచ్చారు. సోమవారం అక్కడకు చేరుకున్న అధికారులు, కోర్టు ఉత్తర్వులతో ఒక దుకాణం మినహా తొమ్మిది దుకాణాలను కూల్చివేశారు. ఆ ప్రకారం, రూ.9 కోట్ల విలువైన 15,000 చ.అ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఈటీసీ బంపర్ ఆఫర్

● మొదటి బహుమతిగా టూ వీలర్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులో ప్రయాణించే వారికి బహుమతులు అందజేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) సంయుక్తంగా ప్రకటించాయి. ఆ ప్రకారం, నవంబరు 21వ తేది నుంచి జనవరి 20వ తేది వరకు ఎస్ఈటీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకున్న వారు ఈ బహుమతులకు అర్హులు. ఆయా తేదీల్లో ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొని ప్రయాణించిన వారి పేర్లను లక్కీడిప్ ద్వారా తీసి విజేతలను ప్రకటించనున్నారు. మొదటి బహుమతిగా ద్విచక్రవాహనం, రెండవ బహుమతిగా ఎల్ఈడీ స్మార్ట్ టీవీ, మూడో బహుమతిగా ఫ్రిజ్ అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో తాగునీటి పథకాల పర్యవేక్షణ

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 544 ఉమ్మడి తాగునీటి పథకాలను 'ఆన్‌లైన్'లో పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.239 కోటు కేటాయించింది. కావేరి, కొల్లిడం, తామ్రభరణి, ఆళియారు, పొన్నైయారు, పాలారు, కుశస్థలి సహా పలు జలవనరుల ద్వారా 544 ఉమ్మడి తాగునీటి పథకాలను రాష్ట్ర తాగునీటి మండలి నిర్వహిస్తోంది. ఈ పథకాల ద్వారా 13 కార్పొరేషన్లు, 323 మున్సిపాలిటీలు, 51,408 నివాస ప్రాంతాలు, 576 కర్మాగారాలకు ప్రతిరోజు 2.28 టీఎంసీల నీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి వృధా తగ్గించడం తదితరాలకు 'స్మార్ట్ మీటర్లు' ఏర్పాటుచేసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. స్థానిక చేపాక్కంలోని తాగునీటి మండలి ప్రధాన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా 544 ఉమ్మడి తాగునీటి పథకాలను పర్యవేక్షించనున్నారు. ఆయా కేంద్రాల వద్ద పరికరాల ఏర్పాటు 15 నెలల్లో ముగించాలని తాగునీటి మండలి నిర్ణయించింది.

15 వేల ఇళ్లలో సౌర విద్యుత్ కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం కింద, రాష్ట్రంలోని 15,000 ఇళ్లపై 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 'పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజన' అనే ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రధాని మోదీ గత ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఈ పథకం కింద కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు రూ.30,000, 2 కిలోవాట్ కేంద్రం ఏర్పాటుకు రూ.60,000, అంతకు మించి ఒక్కో కిలో వాట్‌కు రూ.18,000 సబ్సిడీగా ఇస్తున్నారు. దానికోసం సూర్య ఇల్లు - ఉచిత ఇల్లు పథక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ కేంద్రం ఏర్పాటైన వెంటనే లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో సబ్సిడీ జమచేస్తున్నారు. ఈ పథకానికి రాష్ట్రం నుంచి 72,000 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 19,500 మందికి అనుమతి లభించాయి. వారిలో 15,000 మంది ఇళ్లలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటయ్యాయని అధికారులు తెలిపారు.

అర్చక శిక్షణ పొందిన 115 మందికి సర్టిఫికెట్లు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్చక శిక్షణా పాఠశాలలో శిక్షణ పూర్తి చేసిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన 11మంది మహిళల సహా మొత్తం 115 మంది విద్యార్థులకు దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రధానాలయాల ఆధ్వర్యంలో అర్చకుల శిక్షణా పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో యేడాది కాలపరిమితి కలిగిన అర్చక కోర్సును 11 మంది మహిళలు, 97 మంది యువకులు విజయవంతంగా పూర్తి చేశారు. వీరికి మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు అభినందించి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వం పాతకాలం నాటి అర్చక, నాదస్వర, ప్రబంధ పాఠశాలలను పునఃప్రారంభించి, ఆసక్తి కలిగిన వారికి ప్రవేశాలు కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా, గత యేడాది అర్చకులుగా, శైవ భక్తిగీతాలాపన కోర్సుల్లో విద్యార్థులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారన్నారు.

అన్నాడీఎంకేలోకి ఓపీఎస్ వర్గీయులు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన వెయ్యిమంది కార్యకర్తలు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళని స్వామి వర్గంలో చేరారు. స్థానిక ఆలందూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామన్ నేతృత్వంలో వీరంతా అన్నాడీఎంకేలో చేరారు. స్థానిక గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఎడప్పాడి నివాసంలో వీరంతా అన్నాడీఎంకేలో చేశారు.

చెత్త వేసిన వారికి రూ.92.18 లక్షల జరిమానా

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు, జలాశయాలు తదితర ప్రాంతాల్లో చెత్త వేసిన వారి నుంచి నెలన్నర కాలంలో రూ.92.18 లక్షల జరిమానా వసూలుచేశారు. మరోసారి ఇలాంటివి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదుచేస్తామని జీసీసీ కమిషనర్ హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా జీసీసీ పలు చర్యలు చేపడుతోంది. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్దకే వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. అదే సమయంలో నగరంలోని రోడ్లు, జలాశయాల్లో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా జీసీసీ మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. ఆ ప్రకారం, నిబంధనలు అతిక్రమించి బహిరంగ ప్రాంతాల్లో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారి నుంచి గత అక్టోబరు నుంచి ఈ నెల 10వ తేది వరకు రూ.92.18 లక్షల జరిమానా వసూలుచేశారు. అలాగే, జరిమానా కట్టిన వారు మరోసారి పట్టుబడితే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదుచేస్తామని జీసీసీ హెచ్చరించింది.

డీఎంకే మాజీ ఎమ్మెల్యే కన్నుమూత

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీపెరుంబుదూర్ మాజీ ఎమ్మెల్యే కోదండం (99) వృద్ధాప్యం కారణంగా మంగళవారం కన్నుమూశారు. 1989, 1996 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన డీఎంకే అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికదేహాన్ని ఆయన ఇంటిలో ఉంచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో రూ.80లక్షల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో థాయ్‌లాండ్ నుండి వచ్చిన విమానంలో రూ.80లక్షల గంజాయి తీసుకువచ్చిన ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీ మీదుగా చెన్నై వస్తున్న విమానంలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నట్లు సమాచారం అందటంతో మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు మంగళవారం ఉదయం నిఘా వేశారు. ఆ విమానం నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేశారు. ఆ సందర్భంగా చెన్నై మన్నడి ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫరూఖ్ అనే యువకుడి బ్యాగ్ తెరచి చూడగా అందులో 1.5 కేజీల విదేశీ గంజాయి లభించింది. వెంటనే అతడిని అరెస్టు చేశారు. గంజాయి అక్రమరవాణాలో అతడికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

మద్యం దుకాణంపై పెట్రోల్ బాంబు దాడి

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కం జవహర్ లాల్‌రోడ్డులోని టాస్మాక్ దుకాణంపై పెట్రో బాంబు దాడి జరిపిన మందుబాబును పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి ఆ దుకాణం బార్‌లో మద్యం తాగిన తిరుములైవాయల్ ప్రాంతానికి చెందిన విష్ణు అనే వ్యక్తి తన దగ్గరున్న చిరిగిన నోటిచ్చి కొత్త నోటివ్వమంటూ సిబ్బందితో గొడవపడ్డాడు. మద్యం దుకాణం సిబ్బంది అతడిని బలవంతంగా బయటకు నెట్టివేశారు. కాసేపయ్యాక విష్ణు తిరిగొచ్చి ఆ మద్యం దుకాణంపై పెట్రోలు బాంబు విసిరి పారిపోయాడు. బార్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విష్ణుని అరెస్టు చేశారు.

పగిలిన మురుగన్ నవపాషాణ పీఠం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేట సమీపం హస్తినాపురంలోని ఆలయంలో నవపాషాణ మురుగన్ విగ్రహ పీఠం ధ్వంసం కావటంతో భక్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పళని ఆలయంలో దండాయుధపాణి విగ్రహాన్ని బోగర్ అనే సిద్ధపురుషుడు నవపాషాణంతో తయారు చేశారు. ఆ రీతిలో వడపళని సిద్ధపురుషుడు ఈ ఆలయానికి నవపాషాణ మురుగన్ విగ్రహాన్ని చేసి ఇచ్చాడని స్థలపురాణ. ఈ విగ్రహాన్ని అభిషేకించిన జలాలను సేవిస్తే రోగాలు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ విగ్రహం దిగువ గుండ్రటి పీఠం ఉండేది. ప్రస్తుతం ఆ పీఠం దెబ్బతిని ఉండడం భక్తులు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పల్లావరణం తహసీల్దార్ ఆరుముగం ఇతర అధికారులు ఆ ఆలయానికి మంగళవారం ఉదయం వెళ్ళి పరిశీలించారు. విగ్రహ పీఠం పగిలిన విషయం వాస్తవమేనని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు త్వరలో నివేదిక పంపనున్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల పేరిట ఈ-మెయిల్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి ప్లస్ టూ విద్యార్థుల పేరుతో ఈ-మెయిల్ ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న కోర్సులు, దరఖాస్తు సమర్పణ, పాఠ్యాంశాలు, పరీక్షల టైం టేబుల్ సహా పలు వివరాలను విద్యార్థులకు ఈ-మెయిల్‌లో పంపిస్తున్నారు. కానీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ-మెయిల్ లేకపోవడంతో వారు ఉన్నత విద్యపై పలు విషయాలు తెలుసుకోలేకపోతున్నారు. దీనిపై దృష్టి సారించిన పాఠశాల విద్యాశాఖ, 9 నుంచి ప్లస్ టూ విద్యార్థుల పేరుతో ఈ-మెయిల్ ప్రారంభించాలని, పాస్‌వర్డ్ వినియోగించి ఈ-మెయిల్ ఓపెన్ చేయడం, సర్టిఫికెట్లు ఇతర పత్రాలు అప్‌లోడ్ చేయడం తదితరాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని, విద్యార్థుల పేరుతో ప్రారంభించిన ఈ-మెయిల్ వివరాలు డిసెంబరు నెలాఖరులోగా 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదచేయాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నటి కస్తూరి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు


ధర్నా చేస్తున్న ద్రావిడ దేశం కృష్ణారావు, బంకా చిరంజీవి తదితరులు

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీనటి కస్తూరిని అదుపులోకి తీసుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ నెల 3వ తేదీ ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం సమీపంలో హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నటి కస్తూరి తెలుగు వారి పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో పలు తెలుగు సంఘాలు కస్తూరి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాయి. రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కస్తూరిపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆమె ముందస్తు బెయిలు కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, కస్తూరిని అరెస్ట్ చేసేందుకు ఏర్పాటైన రెండు పోలీసు బృందాలు ఆమె కోసం గాలిస్తున్నాయి.

కస్తూరిని అరెస్ట్ చేయాలి: ద్రావిడ దేశం కృష్ణారావు

తెలుగు వారిని కించపరిచేలా మాట్లాడిన నటి కస్తూరిని వెంటనే అరెస్ట్ చేయాలని ద్రావిడ దేశం వ్యవస్థాపకులు వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. కస్తూరి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిని ఉద్దేశించే గర్హనీయ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. అందుకే తాను మంగళవారం ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని చెరువుకొమ్ముపాలెంలో వున్న కరుణ పూర్వీకుల నివాసాన్ని సందర్శించి, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపానన్నారు. తమిళనాడులో సామాజిక న్యాయాన్ని అమలు చేసిన కరుణ గురించి చిన్న నటి కస్తూరి విమర్శించడం సరి కాదన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కస్తూరి చిత్రపటాలను దగ్ధం చేసి నిరసన తెలిపినట్లు కృష్ణారావు పేర్కొన్నారు.

జోరుగా అయ్యప్ప భక్తుల సామగ్రి విక్రయాలు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం మరో మూడు రోజుల్లో ప్రారంభంకానుంది. దీంతో ఈరోడ్ సహా పలు జిల్లాల్లో అయ్యప్ప మాలధారణకు అవసరమైన సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈరోడ్‌లోని పన్నీర్‌సెల్వం మార్కెట్, ఈశ్వరన్ కోయిల్ వీధి, టీవీఎస్ వీధి కామరాజర్ వీధి చుట్టుపక్కల ప్రాంతాల్లో వీటిని కొనుగోలు చేసేందుకు అయ్యప్ప భక్తులు వస్తున్నారు.

'కంగువా' స్పెషల్ షోకు
సర్కారు అనుమతి



దర్శకుడు సిరుత్తై శివ - హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందిన 'కంగువా' చిత్రం ఈ నెల 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానున్న నేపథ్యంలో అదనపు ఆట (స్పెషల్ షో)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోజూ ప్రదర్శించే నాలుగు ఆటలతో పాటు అదనంగా మరో ఆట వేసేందుకు అంగీకారం తెలిపింది. అయితే, తొలి షో ఉదయం 9 గంటలకు, చివరి ఆట అర్ధరాత్రి 2 గంటల్లోపు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ

'కంగువా'లో సూర్య

సహా ఏకంగా పదికిపైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ షో ప్రదర్శనకు అనుమతివ్వాలంటూ నిర్మాణ సంస్థ చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక్క రోజు మాత్రమే అదనపు ఆట ప్రదర్శించుకునేందుకు అనుమతిచ్చింది. అయితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం కంగువా తొలి ఆట తెల్లవారుజామున 4 గంటలకే ప్రదర్శించనున్నారు. తమిళనాడులో మాత్రం ఇలాంటి అనుమతి లభించలేదు.

చిత్రజ్యోతి

నటనే కాదు వ్యాపారంలో కూడా...

హోటల్ బిజినెస్‌లో కోలీవుడ్ నటులు



సిమ్రన్



ప్రియా భవానీ శంకర్

కోలీవుడ్‌కు చెందిన పలువురు హీరోహీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సొంతంగా వ్యాపారాలు చేస్తున్నారు. వీరిలో అనేక మంది హోటల్ వ్యాపారం గుట్టుచప్పుడుకాకుండా చేస్తున్నారు. అలాంటి వారిలో హీరోయిన్లు ప్రియా భవానీ శంకర్, సిమ్రన్, హీరోలు ఆర్య, సూరి, జీవా, నటుడు కరుణాస్ ఇలా అనేక మంది ఉన్నారు. హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ చెన్నైలో హోటల్ నడుపుతున్నారు. ఈ విషయం చిత్రపరిశ్రమలో చాలా మందికి తెలియదు. 'లైమ్స్ డిన్నర్' పేరుతో ఈ హోటల్ బిజినెస్ బాగానే జరుగుతుంది. కోలీవుడ్ యంగ్ హీరోయిన్ అయిన ప్రియా భవానీ... ఎలాంటి ప్రైవేట్ పార్టీల్లో పాల్గొనకుండా, గాసిప్స్ లేకుండా తన సినీ కెరీర్ కొనసాగిస్తోంది. ఒకప్పుడు అనేక మంది హీరోయిన్లకు గట్టి పోటీ ఇచ్చిన సిమ్రన్... నగర శివారు ప్రాంతమైన షోళింగనల్లూరులో 'గోడ్కా బై సిమ్రాన్' పేరుతో హోటల్ నడుపుతున్నారు. కమెడియన్‌గా, హీరోగా అదరగొడుతున్న పరోటా సూరి మదురైలో పరోటా హోటల్ నడుపుతుండగా, ఇది రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందింది. 'అమ్మ' అనే పేరుతో ఆయన రెండు హోటళ్ళను నడుపుతున్నారు. ఇటు సినిమాలు, అటు రాజకీయాల్లో కొనసాగుతున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్ కరుణాస్... భార్యతో కలిసి హోటల్ బిజినెస్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి కుమారుడు, హీరో జీవా నగరంలో ఒక హోటల్ నిర్వహిస్తున్నారు. చిత్రపరిశ్రమకు చెందిన సెలెబ్రిటీల కుటుంబాలకు సంబంధించిన ఏ శుభకార్యం అయినా ఇక్కడే జరుగుతుంటాయి. ఇక్కడ భోజన సౌకర్యాలను ప్రముఖ సెలెబ్రిటీ చెఫ్ మాదంపట్టి రంగరాజ్ తన బృందంతో దిగిపోయి రుచికరమైన ఆహారపదార్థాలను చేసి వడ్డిస్తుంటారు. అలాగే, అమెరికాలో కూడా సొంతంగా హోటల్ నడుపుతున్నారు. హీరో ఆర్య స్థానిక అన్నా నగర్, వేళచ్చేరిలో 'షీ షెల్' పేరుతో హోటల్ నడుపుతుండగా, దర్శక నటుడు అమీర్ '4ఏఎం కాఫీ' పేరుతో ఈసీఆర్‌లో ఔట్‌లెట్ నెలకొల్పారు. ఇలాగే మరికొంతమంది సెలెబ్రిటీలు సమాచారం బయటకు పొక్కకుండా హోటల్ బిజినెస్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం.

సత్యరాజ్ కుమార్తె దివ్య





మా అమ్మకు ఏలోటూ లేకుండా చూసుకుంటున్నాం

వెల్లడించిన సత్యరాజ్ కుమార్తె

మా అమ్మకు నాలుగేళ్లుగా ఏ లోటూ లేకుండా జాగ్రత్త గా చూసుకుంటున్నామని సీనియర్ నటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య తాజాగా వెల్లడించారు. ఆమెకు సపర్యలు చేసేందుకు వీలుగా ఒక మనిషిని కూడా నియమించినట్టు వెల్లడించారు. సత్యరాజ్ కుమార్తె దివ్య తాజాగా తన తల్లి ఆరోగ్య పరిస్థితిని ఇన్‌స్టా ఖాతా ద్వారా వెల్లడించారు. 'గత నాలుగేళ్ళుగా నా తల్లి మహేశ్వరి కోమాలో ఉన్నారు. ఆమెను ఇంటిలోనే ఉంచుకుని ఏ లోటూ లేకుండా జాగ్రత్తగా కాపాడుకుంటున్నాం. ఆహారం కూడా ట్యూబ్ ద్వారానే అందిస్తున్నాం. హృదయం ముక్కలైంది. మానసికంగా కుంగిపోయాం. అయినప్పటికీ బలమైన నమ్మకం, విశ్వాసంతో మా అమ్మ తిరిగి కోలుకుంటారని ఆశిస్తున్నాం. అమ్మ కోమాలో ఉండటంతో నాన్నే కుటుంబాన్ని చూసుకుంటున్నారు. నాకు ఒక అమ్మలా మారిపోయారు. కొన్నేళ్ళ క్రితం మా నాన్నమ్మ (సత్యరాజ్ తల్లి) కన్నుమూశారు. దీంతో నేను నాన్నకు తల్లిలా మారిపోయాను. ఇలా ఒకరిపై ఒకరు ప్రేమాభిమానాలు చూపించుకుంటూ జీవిస్తున్నాం' అని పేర్కొన్నారు.



అజిత్‌తో రోబో శంకర్

అజిత్ సలహాతో సిగరెట్‌కు దూరం

నటుడు రోబో శంకర్‌కు అగ్రహీరో అజిత్ ఓ సలహా ఇచ్చారు. అప్పటి నుంచి ఆయన సిగరెట్ కాల్చడం మానేశారు. ఈ విషయాన్ని తాజాగా రోబో శంకర్ వెల్లడించారు. సాధారణంగా అజిత్‌తో కలిసి నటించే వారు.. ఆయనలోని మంచి గుణాలు, అలవాట్లను సమయం వచ్చినపుడు వ్యక్తం చేస్తుంటారు. ఈ కోవలోనే నటుడు రోబో శంకర్ కూడా అజిత్ ఇచ్చిన సలహా వెల్లడించారు. 'ఒక రోజు లొకేషన్‌లో నన్ను సిగరెట్ అడగ్గా నేను ఇచ్చేందుకు నిరాకరించాను. ఆయన సిగరెట్లు కాల్చడం మానేసి ఎనిమిదేళ్ళు అయింది. ఈ విషయం షాలినికి తెలిస్తే పెద్ద గొడవ అవుతుందని ఆయన అసిస్టెంట్లు కూడా నాకు చెప్పారు. అయినప్పటికీ ఆయన బలవంతంగా నా చేతిలో ఉన్న సిగరెట్‌ను తీసుకుని తదేకంగా చూస్తుండిపోయారు. కొద్దిసేపు తర్వాత ఆ సిగరెట్ నేను తీసుకుని ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాను. ఆ రోజున అజిత్ ఓ సలహా ఇచ్చారు. 'నేను సిగరెట్లు కాల్చడం మానేసి ఎనిమిదేళ్ళు అయింది. నీవు కూడా క్రమంగా మానుకో శంకర్' అని సూచించారు. అప్పటి నుంచి ధూమపానానికి దూరంగా ఉంటున్నాను' అని రోబో శంకర్ చెప్పారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటు చేసిన విద్యాసంస్థ. సమాజంలో అణగారిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ... బోధనలో ప్రత్యేకత చూపిస్తున్న సీడీ నాయగం స్కూల్... ఆదిలో కేవలం బాలికల అభ్యుదయం కోసం ఏర్పాటైన ఈ పాఠశాల .. అనంతరం బాలురకూ విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది దేశవిదేశాల్లో ఉన్నత ఉద్యోగాలతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తుండడం విశేషం.

- అడయార్, ఆంధ్రజ్యోతి



బాలికా విద్యకు శ్రీకారం

అభాగ్యులకు అండగా ...

ఈ పాఠశాల ప్రవేశాల్లో వితంతువులు, భర్తలు విడిచిపెట్టిన మహిళల పిల్లలతో పాటు అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తారు.. ఈ విధానం ఇప్పటికీ పాటిస్తున్నామని పాఠశాల కార్యదర్శి రామసుందర సుబ్రమణియన్ తెలిపారు. కాలక్రమంలో అల్పాహార, మధ్యాహ్న భోజన పథకాలను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. 1930లో రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభించి, కులశేఖరపట్టణం చుట్టుపక్కల ప్రాంతాల పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించారు సీడీ నాయగం. ఇదే స్ఫూర్తితో 1933లో టి.నగర్‌లో కూడా ఒక పాఠశాల నెలకొల్పారు.

అణగారిన వర్గాలకు ప్రాధాన్యం

● 120 యేళ్ళుగా విద్యా సేవలో సీడీ నాయగం స్కూల్ ● బోధనా పద్ధతులు ప్రత్యేకం

ఆధునిక పోటీ ప్రపంచంలో దశాబ్దకాలం పాటు ఒక విద్యా సంస్థ నడపడమే మహా కష్టం. అలాంటిది 120 యేళ్ళుగా విద్యా సేవలో ఒక పాఠశాల తరిస్తోందంటే ఎవరికైనా ఆశ్చర్యం వేయకమానదు. అలాంటి మహోన్నతమైన పాఠశాల ప్రధాన ఓడరేవు జిల్లా అయిన తూత్తుకుడిలోని కులశేఖరపట్టణంలో ఉంది. నేటి ప్రపంచంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని నిలబడటమే కాకుండా ప్రైవేట్ విద్యా సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యనందిస్తోంది. సమాజంలోని అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు అడ్మిషన్లలో తొలి ప్రాధాన్యతనిస్తూ, రిజర్వేషన్ విధానాన్ని అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. ఇంతకీ ఆ విద్యా సంస్థను ఎవరు స్థాపించారు? దాని పేరేంటి? వంటి విషయాలు తెలుసుకుందాం రండి!

చెట్టికుళం దేవనాయకం చొరవతో...

తూత్తుకుడి జిల్లాలోని కులశేఖరపట్టణానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన ముత్తారమ్మన్ ఆలయంలో ప్రతి యేటా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఊరికి చెందిన చెట్టికులం దైవనాయగం (సీడీ నాయగం) 120 యేళ్ళ క్రితం 1904లో బాలికల కోసం ఓ పాఠశాలను, 1947లో ఉపాధ్యాయ శిక్షణా సంస్థ స్థాపించారు. ఈయన కేవలం విద్యావంతుడు మాత్రమే కాకుండా, మహిళలకు విద్య అందించాలన్న సంకల్పం కలిగిన మహోన్నత వ్యక్తి. ద్రావిడ కళగం వ్యవస్థాపకుడు ఈవీ రామస్వామికి ఆయన సన్నిహిత మిత్రుడు.

ఆ కాలంలోనే చేతివృత్తులపై శిక్షణ...

26 యేళ్ళ వయసులో పాఠశాల ప్రారంభించిన సీడీ నాయగం.. ఆ తర్వాత చిన్న వయసులోనే మరణించిన తన భార్య తాయమ్మాళ్ పేరుతో నడపసాగారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఇక్కడి బోధనా పద్ధతులు బ్రిటీష్ పాలకులను అమితంగా ఆకర్షించాయి. ప్రధానంగా ఎలిమెంటరీ సైన్స్, నేచురల్ స్టడీ, కిండర్ గార్టెన్ వంటి బోధనా పద్ధతుల్ని బ్రిటీష్ అధికారులు మెచ్చుకున్నారు. పైగా ఆ కాలంలోనే చేతి వృత్తులపై శిక్షణ ఇచ్చేవారు. ఇక్కడ శిక్షణ పొందిన అనేకమంది విద్యార్థినులు తర్వాతి కాలంలో తమ సొంతకాళ్ళపై నిలబడి, ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఇప్పటికీ ఈ పాఠశాలలో బాలబాలికలకు ఆత్మరక్షణకు ఉపయోగపడే కర్రసాము వంటి విద్యల్ని నేర్పిస్తుండడం విశేషం.

రిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటాయింపు...

ఈ పాఠశాలలో 1935లో 241 మంది విద్యార్థులుండగా, వీరిలో 48 మందికి హాస్టల్ సౌకర్యం కల్పించారు. వీరిలో 24 మంది ఎస్సీలు, 18 మంది బీసీలు, ముగ్గురు ఇసై వేళాలర్, ముగ్గురు వేళాలర్ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు రిజర్వేషన్ ప్రకారం హాస్టల్‌లో అడ్మిషన్ కల్పించారు. 1947లో ఉపాధ్యాయుల శిక్షణా సంస్థ ప్రారంభించి వల్లియమ్మయార్ హిందూ టీచర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా నామకరణం చేశారు. అప్పటి నుంచి కులశేఖరపట్టణం మహిళా సాధికారతకు ఓ చిహ్నంగా మారిపోయింది. "ఈ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన నా సోదరీమణులంతా ఉపాధ్యాయులు అయ్యారు. ఇది వారి జీవితాలను శాశ్వతంగా మార్చివేసింది. ఇపుడు వారంతా తమ పిల్లలు, మనవరాళ్ళతో సంతోషంగా రిటైర్డ్ జీవితాన్ని గడుపుతున్నారు" అంటూ తిరుచెందూర్ ఆలయంలో ప్రఖ్యాత నాదస్వర విద్వాంసుడు రాజగోపాలకంబర్ కుమార్తె, రిటైర్డ్ టీచర్ కేఆర్ సుబ్బులక్ష్మి సంతోషంగా చెప్పారు.



కర్రసాములో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

2017లో టీచర్ ట్రైనింగ్ కాలేజీ మూసివేత...

తగినంత మంది విద్యార్థులు లేకపోవడంతో 2017లో ఉపాధ్యాయ శిక్షణా సంస్థ మూసివేశారు. ప్రస్తుతం తాయమ్మాళ్ మిడిల్ స్కూల్, వల్లియమ్మయార్ బాలికల హయ్యర్ సెకండరీ స్కూల్ ఉండగా, ఈ రెండింటిలో 250 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలలో అల్పాహార, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేస్తున్నారు. అయితే, ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం పాఠశాలల నుంచి ఎదురవుతున్న పోటీ సవాల్‌గా మారిందని, అయినప్పటికీ తమ పాఠశాలలో అందించే విద్యకు డిమాండ్ ఉందని, మా సేవలు అవసరమైన పిల్లలకు అందించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తూనే ఉంటామని ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ శుభా దేవనాయగం వెల్లడించారు.



బాలికల వసతిగృహం వద్ద సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ప్రారంభించిన జోష్ అండర్‌వుడ్ తదితరులు

అరుణోదయం వసతిగృహాలకు అమెరికా సంస్థ సహకారంతో సోలార్ విద్యుత్

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూకాంబిగైనగర్, కళ్ళికుప్పంలోని అరుణోదయం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుపుతున్న వసతి గృహాలకు అమెరికాకు చెందిన వాల్టర్స్ క్లువేర్ సంస్థ 18 కె.వి.సామర్థంతో సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆ టస్టు నడుపుతున్న బాలికల వసతి గృహానికి 10 కె.వి. విద్యుత్, బాలర వసతి గృహానికి 8 కె.వి. విద్యుత్ సరఫరా అయ్యేలా ఈ సోలార్ ప్యానెళ్ళను ఏర్పాటు చేశారు.ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థను వాల్టర్స్ క్లువేర్ సంస్థ ఉపాధ్యక్షుడు జోష్ అండర్‌వుడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చెన్నై శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వైద్యనాథన్, అరుణోదయం ట్రస్టు వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ అయ్యప్పన్ సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.



కోయంబత్తూరులో స్వర్ణకారుల కోసం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మంగళవారం సచివాలయంలో కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్న రాష్ట్ర వాణిజ్య సంఘాల సమాఖ్య ఏఎం విక్రమరాజా, చెన్నై డైమండ్ జ్యువెలరీ అసోసియేషన్ చైర్మన్ జయంతిలాల్ జె.సెలాని తదితరులు

27న ఇంజనీరింగ్ ఉత్పత్తులపై అంతర్జాతీయ ప్రదర్శన



మీడియా సమావేశంలో ఈఈపీసీఐ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఈ నెల 27న ఇంజనీరింగ్ ఉత్పత్తులపై అంతర్జాతీయ ప్రదర్శన (ఐఈఎస్ఎస్) ప్రారంభమవుతుందని భారత ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీఐ) చైర్మన్ అరుణ్ గరోడియా తెలిపారు. నగరంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 వరకు జరిగే ఈ ప్రదర్శనలో మూడువేలకుపై ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈపీసీఐ రీజినల్ డైరెక్టర్ జేవీ రాజగోపాలరావు, ఈడీ అదిప్ మిత్రా, ఈఈపీసీఐ సదరన్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు, డిప్యూటీ రీజినల్ చైర్మన్ శశికుమార్ లేవీస్ తదితరులు పాల్గొన్నారు.



క్లినిక్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

మోహన్ డయాబెటిస్‌లో 'హెల్దీ ఏజింగ్ క్లినిక్'

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీ సెంటర్ ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని (వరల్డ్ డయాబెటిస్ డే) పురస్కరించుకుని వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మధుమేహ రోగులకు చికిత్స, సంరక్షణ మరింత మెరుగుపరిచేందుకు దోహదపడేలా 'హెల్దీ ఏజింగ్ క్లినిక్ - డాక్టర్ మోహన్స్ ఆన్ వీల్స్' పారంభించింది. హెల్దీ ఏజింగ్ క్లినిక్ దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధానంగా వృద్ధులైన మధుమేహ రోగుల ప్రత్యేక అవసరాలను తీర్చడం ఈ క్లినిక్ ముఖ్యోద్దేశం. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరడంతో పాటు వృద్ధుల జీవన ప్రయాణాలు, నాణ్యత పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఇందులో మల్టీ డిసిప్లినరీ వైద్యుల బృందం నిరంతరం అందుబాటులలో ఉంటూ వైద్య సేవలను పర్యవేక్షిస్తుందని ఆస్పత్రి చైర్మన్ డా.మోహన్, ఎండీ డా.ఆర్ఎం అంజన ఈ సందర్భంగా తెలిపారు.

స్టార్టప్‌లు ప్రారంభించండి..
ప్రభుత్వ సాయం పొందండి

● డిప్యూటీ సీఎం ఉదయనిధి



పెరియార్ సామాజిక న్యాయ పారిశ్రామికాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలనే లక్ష్యంగా పెట్టుకున్న దివ్యాంగులు, హిజ్రాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. మంగళవారం అడయార్‌లోని ఐఐటీ మద్రాస్ రీసెర్చి పార్కులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పెరియార్ సామాజిక న్యాయ పారిశ్రామికాభివృద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ 2030లోగా ఒన్ ట్రిలియన్ డాలర్ల మేరకు ఆర్థిక ప్రగతి సాధించే రాష్ట్రంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నారని, అణగారిని వర్గాలవారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చే దిశంగా రూ.30 కోట్ల ప్రత్యేక నిధి సమకూర్చారని చెప్పారు. ఆ కోవలోనే దివ్యాంగులు, హిజ్రాలు స్టార్టప్‌లు ప్రారంభిస్తే వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయసహకారాలందిస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, పారిశ్రామిక వాణిజ్య మండలి సంచాలకులు ఎల్. నిర్మల్‌రాజ్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.ఇన్నోసెంట్ దివ్యా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి విళినాథన్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం సచివాయలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎంజీఆర్ ఫిలిమ్ సిటీ చైర్మన్ ట్రాట్స్కీ మరుదు

రాష్ట్రంలో 1.12 కోట్ల మంది యువ ఓటర్లు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువ ఓటర్లు 1.12 కోట్ల మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం సిద్ధం చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా తేల్చింది. వీరంతా 18 నుంచి 29 యేళ్లలోపు వారేనని ఎన్నికల అధికారులు తెలిపారు. వచ్చే యేడాది జనవరి 1 నాటికి 18 యేళ్లు నిండిన వారంతా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం భారీగా సన్నాహాలు చేపడుతోంది. ముఖ్యంగా ఈ నెలలో నాలుగు విడతలుగా పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలోని వివరాల ప్రకారం యువ ఓటర్ల సంఖ్య కోటి 12 లక్షల 60 వేల 373 కు పెరిగింది. అదే విధంగా 18 నుండి 19 యేళ్ల లోపు ఓటర్లు 6.51 లక్షలవరకు ఉన్నారు. 20 నుంచి 29 యేళ్లలోపు ఓటర్లు 1.06 కోట్ల వరకు ఉన్నారు. ఇదే విధంగా 30 నుంచి 39 యేళ్ల లోపు ఓటర్లు 1.29 కోట్లు, 40 నుంచి 49 యేళ్ల లోపు ఓటర్లు 1.36 కోట్ల మంది ఉన్నట్టు తెలిపారు. 50 నుంచి 59 యేళ్లలోపు ఓటరు కోటి 12 లక్షల 54వేల 851 మంది ఉన్నారు. ఇక 60 నుంచి 69 యేళ్లలోపు ఓటర్లు 75.68 లక్షల మంది, 70 నుంచి 79 యేళ్లలోపు ఓటర్లు 861 మంది, 80 యేళ్లకు పైబడినవారు 17.94లక్షల మంది వరకు ఉన్నారని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు.

పవర్‌ఫుల్.. నెల్లటూరు



● 70 శాతం ఇళ్లల్లో విద్యుత్తుశాఖ ఉద్యోగులే
● సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయమే కారణం

నెల్లటూరు.. వెంకటగిరి ప్రధాన రహదారిలో, గూడూరు పట్టణ పరిధి దాటగానే ఈ గ్రామం ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో 400కు పైగా ఇళ్లున్నాయి. 280కు పైగా గృహాలలో విద్యుత్తు శాఖలోని ఏదో ఒక విభాగంలో ఉద్యోగులుగా పనిచేసే వారుంటారు. అందుకే ఆ గ్రామం 'పవర్'ఫుల్ అంటూ చమత్కరిస్తుంటారు. - గూడూరు , ఆంధ్రజ్యోతి

మార్పు మొదలైందిలా..



జిల్లా స్టోర్స్ కార్యాలయం

గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి ఆనుకుని గోగినేనిపురం వస్తుంది. ఆ రోజులలో గోగినేనిపురం.. మైకా పరిశ్రమలకు ప్రసిద్ధి. గూడూరు, నెల్లటూరు, చెన్నూరు, తిప్పవరపాడు గ్రామాల నుంచీ ఆడ, మగ కార్మికులు మైకా పరిశ్రమలలో పనులకు వెళ్లి జీవనోపాధి పొందేవారు. ఈ క్రమంలో నెల్లటూరు గ్రామంలో విద్యుత్‌శాఖ 1956వ సంవత్సరంలో జిల్లా స్టోర్స్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో దీని కోసం ఓ దాత ఆరు ఎకరాల స్థలం ఇచ్చారు. ఈ స్టోర్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్తు తీగలను నిల్వ ఉంచి.. నెల్లూరు జిల్లాలో అవసరమైన చోటికి తరలించేవారు. జిల్లాలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లనూ ఇక్కడికి తీసుకొచ్చి.. బాగు చేసి పంపేవారు. వీటికి కూలీల అవసరం ఎక్కువ. అదే సమయంలో కొన్ని కారణాలతో మైకా పరిశ్రమలలో మగవాళ్లను తొలగించి మహిళలకే అవకాశం ఇచ్చారు. దీంతో నెల్లటూరు గ్రామానికి చెందిన వారు విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులతో పాటు సిమెంట్ విద్యుత్ స్తంభాల నిర్మాణ, ఇతర పనులు చేసేందుకు కాంట్రాక్టు కార్మికులుగా చేరారు.

సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయం..

1983 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ఎన్టీఆర్ సీఎం అయ్యాక కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేశారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు.. వారి అర్హతను బట్టి హెల్పర్లుగా పర్మినెంట్ ఉద్యోగులుగా మారిపోయారు. ఇక్కడ నుంచే ఉద్యోగాల ప్రస్థానం మొదలైంది. క్రమేణా విద్యుత్ వినియోగం పెరగడంతో కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. ఆ సబ్‌స్టేషన్లలో షిఫ్టు ఆపరేటర్ల ఉద్యోగాల కోసం.. జిల్లాస్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది తమ పిల్లలను అర్హతను బట్టి చేర్పించారు. ఇక, హెల్పర్లు.. లైన్‌మెన్‌గా పదోన్నతులు పొందారు. కొంతమంది ఉద్యోగులు అనారోగ్యంతో మృతి చెందగా.. కారుణ్య నియామకాల కింద వారి పిల్లలు అదే శాఖలో ఉద్యోగాలు పొందారు. కొంతకాలం కిందట గోగినేనిపురంలో డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడా ఎక్కువ మంది సిబ్బంది నెల్లటూరుకు చెందిన వారే. ఇలా కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారు క్రమేణా పర్మినెంట్ కావడం, లైన్‌మ్యాన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు పొందారు. అటెండర్ల నుంచి ఏడీఈల వరకు.. ఇలా ఏదో ఒక స్థాయిలో విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక, వాహనాలలో విద్యుత్ పరికరాలను లోడ్, అన్‌లోడ్ చేసేందుకు సుమారు 30 మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.



జిల్లా స్టోర్స్‌లోని విద్యుత్ పరికరాలు



తిరుమలలో కొలువుదీరిన పంచమూర్తుల్లో ఒకరైన ఉగ్రశ్రీనివాసుడు ఏటా ఒకసారి మాత్రమే గర్భాలయం దాటి వస్తారు. కైశికద్వాదశి ఆస్థానం సందర్భంగా వేకువజామున మాడవీధుల్లో ఊరేగి.. సూర్యోదయానికి ముందే తిరిగి లోపలకు వెళ్లిపోతారు. శ్రీవారి ఆలయంలో బుధవారం ఈ ఉత్సవం జరగనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వైసీపీలో రసవత్తరంగా వర్గపోరు



జగన్‌తో మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి తదితరులు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ వర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పార్టీ ఎప్పుడో చీలిపోయింది. సంజీవయ్యకు టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ ఎన్నికలకుముందు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం స్పష్టంచేశాయి. ఇవేవీ పట్టించుకోని అధిష్ఠానం 3వ సారి కిలివేటి సంజీవయ్యకే టిక్కెట్ కేటాయించడంతో ఆ ఎన్నికల్లో వీరంతా కొంత వ్యతిరేకంగా పనిచేశారన్న ప్రచారం జరిగింది. కూటమి అధికారంలోకి రావడంతో దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరతానంటూ ప్రకటించడంతో ఆ వర్గం నాయకులంతా ఆ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఈ వర్గం టీడీపీలో చేరేందుకు ఆ పార్టీలో ఉన్న ఒక వర్గం అడ్డుకోవడంతో దువ్వూరు వర్గం చేరిక వాయిదా పడింది. ఈ క్రమంలో సంజీవయ్య వర్గం గత శుక్రవారం వైసీపీ అధినేత జగన్‌ను కలిసి మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి వర్గంపై ఫిర్యాదు చేశారు. టీడీపీతో తిరుగుతూ పార్టీ ఓటమికి కృషి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ప్రధాన కారణమంటూ వివరించారు. జగన్ ఆదేశాలతో ఉమ్మడి నెల్లూరుజిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శేఖర్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేశారు. అదే సమయంలో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం నాయకులు తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిశారు. షోకాజ్ నోటీసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తమను కిలివేటి సంజీవయ్య కలుపుకుపోవడంలేదని వారు సైతం ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. అన్నింటిని పక్కనపెట్టి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని జగన్ చెప్పినట్లుగా తెలుస్తుంది. జగన్‌ను కలసినవారిలో దబ్బలతోపాటు కళత్తూరు శేఖర్‌రెడ్డి, తడ ఎంపీపీ కొలవి రఘురెడ్డి, నాయకులు గండవరం సురేష్‌రెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, తిరుపాల్, శరత్‌యాదవ్ తదితరులున్నారు.

ఇద్దరు అర్చకులకు షోకాజ్ నోటీసులు

ఎర్రావారిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరాలయంలో భక్తుల ఎదుటే ఘర్షణకు దిగిన ఇద్దరు అర్చకులకు దేవాదాయశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆలయంలో ప్రసన్న కుమార్‌స్వామి, సత్యప్రసాద్‌లు అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది శివరాత్రి బ్రహోత్సవాల సమయంలో అప్పటి ఈఓ జయకుమార్ సిఫార్సుతో ప్రసన్నకుమార్ స్వామి కుమారుడిని తాత్కాలిక అర్చకుడిగా నియమించారు. కొద్ది రోజులు అతను పనిచేశారు. అర్చకుల సెలవుల సందర్భంలో సేవలందిస్తున్నారు. ఈయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మరో అర్చకుడు సత్యప్రసాద్ దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అర్చకుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఇటీవల భక్తుల ఎదుటే కొట్టుకున్నారని సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో కూడా నమోదయ్యాయి. దీంతో ఆలయ ఈఓ మమత విచారించి మంగళవారం ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కాలువలో పడి చిన్నారి మృతి



లహరి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాలువలో పడి చిన్నారి మృతి చెందింది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మధు శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. నిండ్ర ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడు.ఈ దంపతులు శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డులో సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య కల్పన గృహిణి. వీరికి నాల్గో తరగతి చదివే కుమారుడు, ఆరేళ్ల చిన్నారి లహరి ఉన్నారు. కుమార్తె లహరి మానసికంగా పరిణితి చెందలేదు. దీంతో ప్రత్యేక ప్రతిభావంతురాలైన బాలికను తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలోని భవిత కేంద్రంలో సోమవారం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామంలో లహరి భవిత కేంద్రం వద్ద అదృశ్యమైంది. సిబ్బంది వెంటనే బాలిక తల్లిదండ్రులు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అందరూ గాలించారు. భవిత కేంద్రం సమీపంలో కాలువలో పడి బాలిక మృతి చెందినట్లుగా కాసేపటి తరువాత గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చూరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రశ్రీనివాసుడు

గడప దాటేది ఏడాదికోసారే

● 800 ఏళ్ల కిందటి వరకు ఈయనే ఉత్సవమూర్తి
● ఓ సంఘటనతో ఆ స్థానంలోకి మలయప్ప
● నేడు శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల గర్భాలయంలో మూలవిరాట్‌తో పాటు మరో నలుగురుమూర్తులు ఉంటారు. కోర్కెలు తీర్చేది ధ్రువబేరమైన మూలమూర్తి అయితే.. నిత్యసేవలు భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకబేరం) అందుకుంటారు. లెక్కలు అందుకునే స్వామి కొలువు శ్రీనివాసమూర్తి(బలిబేరం). మలయప్ప(ఉత్సవబేరం)ను భక్తులంతా తరచూ వీక్షిస్తుంటారు. ఉత్సవాల సమయంలో ఆలయం నుంచి బయటకు వివిధ వాహనాలపై దర్శనమిచ్చేది ఈ స్వామే. ఐదోవది స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి. ఈయన్ను 'వెంకటంతురైవారు' అని కూడా పిలుస్తారు. 14వ శతాబ్దం వరకు ఉగ్రశ్రీనివాసుడే ఉత్సవమూర్తిగా ఉండేవారని పురాణోక్తి.

ఆ పేరు వెనుక..

ఉగ్రశ్రీనివాసుడని పేరు రావడానికి ఓ ఇతిహాసం ప్రాచుర్యంలో ఉంది. క్రీ.శ.1330 నాటి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తి ఊరేగుతుండగా ఈ స్వామిపై సూర్యకిరణాలు పడ్డాయట. దీంతో తిరుమలలో పెద్ద అగ్నిప్రమాదం జరిగి చాలా ఇళ్లు దగ్ధమయ్యాయట. ఈ క్రమంలోనే సమీపంలోని భక్తుల్లో ఒకరి ద్వారా 'ఇకపై నన్ను ఉత్సవమూర్తిగా వాడద్దు. అలా చేస్తే అగ్నిప్రమాదం వంటి అనర్థాలే జరుగుతాయి' అని స్వామి చెప్పారట. తిరుమల లోయల్లో తానే ఇంకొకమూర్తిగా శ్రీదేవి, భూదేవి సహా సహా ఉన్నానని, ఎక్కడ వెతకాలో గుర్తులు కూడా చెప్పారట. ఆ స్వామినే (ప్రస్తుత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి) ఉత్సవ మూర్తిగా కొలువుదీర్చాలని ఆదేశించారట. అప్పట్నుంచి ఉగ్రశ్రీనివాసమూర్తిగా పేరు వచ్చింది.

నేడు స్వామివారి ఊరేగింపు

ఏటా శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఆ ఒక్కరోజు మాత్రమే ఉగ్రశ్రీనివాసమూర్తి వేకువజాము ఆలయం నుంచి బయటకు వచ్చి నాలుగు మాడవీధుల్లో ఊరుగుతారు. సూర్యకిరణాలు పడకముందే తిరిగి స్వామిని ఆలయంలోకి తీసుకెళ్లిపోతారు. ఈ ఉత్సవం బుధవారం జరగనుంది.

మా డబ్బు మాకు వెనక్కివ్వండి

● తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన



ఎయిర్ అలయన్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15గంటలకు తిరుపతికి చేరుకుని తిరిగి హైదరాబాద్‌కు 8.15 గంటలకు వెళ్లాల్సిన ఎయిర్ అలయన్స్ విమానాన్ని సాంకేతిక కారణాలతో సోమవారం హైదరాబాద్‌లోనే రద్దు చేశారు.ఈ విమానంలో సోమవారం హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో కొంత మంది నగదు వెనక్కు తీసుకుని వెళ్లగా కొంత మంది మంగళవారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 40మంది మంగళవారం ఉదయం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. సాంకేతిక కారణాలతో విమానం రద్దయినట్టు సిబ్బంది చెప్పడంతో ప్రయాణికులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. ప్రతిసారీ ఇలా సాంకేతిక కారణాలు చూపుతూ రద్దు చేయడంపై సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బు వెనక్కిస్తే వేరే విమానంలో వెళతామని చెప్పగా సంస్థ సిబ్బంది సమాధానం చెప్పలేదు. దీంతో ప్రయాణికులు వారిని చుట్టుముట్టడంతో 48 గంటల తరువాత ప్రయాణికుల ఖాతాల్లో టిక్కెట్ల బుకింగ్ వాపస్ డబ్బు పడుతుందని చెప్పారు.దీంతో కొంతమంది వెనుదిరగ్గా మరికొంతమంది వేరే విమానంలో టిక్కెట్లు బుక్ చేసుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.

ఉన్న పంటను సాగు చేసుకోండి

● కళత్తూరు దళితులకు కలెక్టర్ భరోసా

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న భూముల్లో ప్రస్తుత సాగును పూర్తి చేసుకోవాలని కొత్తసాగుకు అనుమతి లేదని కలెక్టర్ చెప్పారు. మండలంలోని అటవీశాఖ భూ వివాదంపై మంగళవారం కళత్తూరు దళిత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, డీఎఫ్‌వో వివేక్‌ను కలిసి తమగోడును వినిపించారు. స్పందించిన అధికారులు ప్రస్తుతానికి వివాదంలో ఉన్న నేలలో జరుగుతున్న సాగును పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా పంటలు పెట్టొద్దని కలెక్టర్, డీఎఫ్‌వో చెప్పారు. దీంతో రైతులు ప్రస్తుతం వేరుశనగ సీజన్ కాబట్టి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరినా డీఎఫ్‌వో అంగీకరించలేదు. సాగులో ఉన్న పంటకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని మిగిలిన దాంట్లో అడుగుపెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. టవర్లను ఎక్కడం మానుకోవాలని హితువు పలికారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

తిరుమలలో సినీ హీరోలు



మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సినీ హీరో మంచు విష్ణు



శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్న సినీ కథానాయకుడు వరుణ్‌తేజ్



క్యాన్సర్‌పై అవగాహన పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

రేపటి నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

● ప్రతి బృందం రోజుకు 5 కుటుంబాలకు పరీక్ష నిర్వహించాలన్న కలెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఇంటింటికి వెళ్లి నిర్వహించే క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఆయన స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వైద్యుడు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఈ నెల 18 నుంచి నిర్వహించే పలు వైద్య పరీక్షల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని వైద్యాధికారులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలను స్నేహపూర్వకంగా నిర్వహించాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనికి ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు 5 కుటుంబాలను కలిసి వైద్య పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారులతో కలిసి క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాప్‌కు బహిష్కృత ఎమ్మెల్యే



సత్యవేడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌కు ఆ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే ఆదిమూలం హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయనపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబరు 5న పార్టీ నుంచి సస్పెండు చేసిన విషయం తెలిసిందే. లైంగిక ఆరోపణల కేసు హైకోర్టులో వీగిపోవడంతో ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నియోజకవర్గ నా యకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో బడ్జెట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరు కావడం స్థానికంగా చర్చకు దారి తీసింది.

ఏది గోల్డు.. ఏది రోల్డు?

బ్యాంకుల్లో అసలు గోల్డ్ ఏదో, రోల్డ్ గోల్డ్ ఏదో తేల్చాల్సింది అప్రైజర్. బంగారు నాణ్యతను పరీక్షించి గ్రాముకు ఎంతివ్వాలో నిర్ణయించేదీ అతడే. అప్రైజర్‌ను మెప్పిస్తేనే అనుకున్న రుణం దొరుకుతుంది. లేకుంటే బంగారంలో రాళ్లున్నాయని కోతలేస్తుంటారు. అదే అప్రైజర్ తలుచుకుంటే నకిలీ బంగారు కూడా అసలైపోతుంది. తాజాగా తిరుపతి టౌన్‌బ్యాంకులో ఓ అప్రైజర్ చేతివాటం బ్యాంకు వర్గాల్లో కలకలం రేపింది. ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● టౌన్ బ్యాంకులో అప్రైజర్ చేతివాటం
● కుటుంబ సభ్యుల పేరిట నకిలీ బంగారం తాకట్టు
● ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సస్పెన్షన్
● ఆందోళనలో ఖాతాదారులు



వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన తిరుపతి టౌన్ బ్యాంకులో అప్రైజర్లు చేతివాటం చూపించడం ఇది రెండోసారి. 30 ఏళ్ల కిందట ప్రభాకర్ అనే అప్రైజర్ దొంగ బంగారం తనఖాపెట్టి వేలల్లో కాజేసి దొరికిపోయాడు. తాజాగా టౌన్‌బ్యాంకుతిరుమల శాఖలో చేరిన రూపేష్ తన భార్య, అమ్మ పేరిట నకిలీ బంగారం పెట్టి రూ.ఆరు లక్షలు కాజేయడంతో ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది. ఏడాది తర్వాత రెన్యువల్ చేసుకునే క్రమంలో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయించగా అసలు గుట్టు ఆలస్యంగా బయటపడింది. విచారణలో వెల్లడికావడంతో నగదును రికవరీ చేసి విధులనుంచి సస్పెండ్ చేశారు. కాగా, టౌన్ బ్యాంకులోని వివిధ శాఖలో ఐదుగురు అప్రైజర్లు పనిచేస్తున్నారు. గతంలో తరుచూ అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఒకేశాఖలో దీర్ఘకాలం ఉండేవారు. దీంతో అవకతవకలకు పాల్పడే అవకాశం ఏర్పడింది. ఇందులో భాగంగానే తిరుమల బ్యాంకులో పని చేసే రూపేష్ తన చేతివాటాన్ని చూపాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రైజర్ల అంతర్గత బదిలీలు చేయడంతో నకిలీ బంగారం వెలుగులోకి వచ్చింది. లేకుంటే అదే అప్రైజర్ ఉండుంటే ఈ నకిలీ బంగారం రెన్యువల్ అయిపోయేది. కాగా, గతంలో టౌన్‌బ్యాంకులోని అన్ని శాఖల్లో రోజుకు రూ.50లక్షల వరకు బంగారు రుణాలను ఖాతాదారులు పొందేవారు.బ్యాంకు మీద విశ్వాసం సన్నగిల్లడంతో ప్రస్తుతం రూ.20లక్షల రుణాలు కూడా తీసుకోవడంలేదు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని శాఖల్లో తనఖా ఉన్న బంగారాన్ని తనిఖీ చేసి ఖాతాదారులకున్న అనుమానాలను తెరదించాల్సిన బాధ్యత టౌన్‌బ్యాంకు పాలకమండలి, అధికారయంత్రాంగంపై ఉంది.అడ్డంగా దొరికినప్పుడు ఉద్యోగం నుంచి తప్పించి చేతులు దులుపుకొంటున్నారే గానీ చట్టపరమైన చర్యలకు బ్యాంకు వర్గాలు వెనకడుగు వేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

జాతీయ బ్యాంకుల్లోనూ..

కోఆపరేటివ్ బ్యాంకుల్లోనే కాకుండా జాతీయ బ్యాంకుల్లోనూ అప్రైజర్లు అప్పుడప్పుడూ నకిలీ బంగారం పెట్టి నగదు స్వాహా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయ బ్యాంకుల్లో కమీషన్ పద్ధతి కింద అప్రైజర్లు పనిచేస్తుంటారు. ఏళ్ల తరబడి ఒకే శాఖలో ఉండటంతో అవకతవకలు జరిగే అవకాశంలేకపోలేదు. 'దొరికినవాడు దొంగ దొరకనివాడు దొర' అన్నట్టుగా కొందరు అప్రైజర్లు చెలామణి అవుతున్నారన్న విమర్శలున్నాయి.

తనఖా బంగారాన్నంతా తనిఖీ చేస్తున్నాం

టౌన్ బ్యాంకు పరిధిలోని తనఖా ఉన్న బంగారన్నంతా తనిఖీ చేస్తున్నాం. ఇప్పటికే తిరుమల శాఖలో బంగారాన్ని పరిశీలించాం. పునఃతనిఖీ కోసమే మాజీ సీనియర్ అప్రైజర్ ఎం.వేదాచలంను నియమించాం. ఆయా శాఖల మేనేజర్లతో కలిసి తన ఖాలో ఉన్న బంగారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని లేఖలు రాశాం. రూపేష్‌ను సస్పెండ్ చేశాం. కమిటీ నిర్ణయం తర్వాత డిస్మిస్ చేస్తాం. ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి అప్రైజర్లను అంతర్గతంగా బదిలీచేసేలా నిర్ణయం తీసుకున్నాం. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. వారి బంగారు సురక్షితం.

- శివకుమార్‌రెడ్డి, ఎండీ, తిరుపతి టౌన్ బ్యాంకు